# "నల్లకోటు నాటకం"



లాయర్ సతీష్‌బాబు చెబుతున్నది వింటుంటే ఆ ఇద్దరికీ మతిపోయినట్లయ్యింది. 'ఎటువంటివాడు ఎలా మారిపోయాడు?' ఇద్దరూ విస్తుపోయారు.

కాలేజీ రోజుల్లో అతి నెమ్మదస్తుడిగా, చీమకు్కూడా అపకారం తలపెట్టనివాడుగా మంచిపేరు తెచ్చుకున్న సతీష్‌బాబు కళాశాల చదువు తర్వాత ఆ ఇద్దరితో విడిపోయి రాజధానిలో లాయర్ చదివి, అక్కడే ప్రాక్టీసు పెట్టాడు.

అదంతా జరిగి ఇప్పటికి పది సంవత్సరాలయ్యింది. లీడింగ్ లాయర్‌గా సతీష్‌బాబు సంపాదించిన పేరు ప్రఖ్యాతులు విన్న తర్వాత పాత మిత్రులిద్దరూ అతన్ని కలసి పోదామని అక్కడికి వచ్చారు. వాళ్ళు వచ్చి కూర్చున్న తర్వాత-

"చూడండి పార్థసారధిగారు. ఇంతకీ మీ వాడే హత్య చేశాడంటారు" పాత మిత్రులు వచ్చిన తర్వాత, తన కోసం వచ్చిన ఇద్దరు క్లయింట్స్‌ని ఉద్దేశించి అడిగాడు లాయర్ సతీష్‌బాబు.

"అవునండీ! ఆ నేరం మా వాడి మీదకు రాకుండా చేస్తారని, మీ పేరువిని ఇక్కడికి వచ్చాం. ఫీజెంతయినా ఫర్వాలేదు" చెప్పాడు అతను.

"హత్య జరిగిన సమయంలో మరెవ్వరన్నా అక్కడ వున్నారా?" అడిగాడు క్యాజువల్‌గా సతీష్‌బాబు.

"ఎవరూ లేరండి. హత్య జరిగిన వెంటనే మావాడు కత్తి పట్టుకుని ఇంటికొచ్చేశాడు. సంగతి చెప్పగానే సరాసరి మీ దగ్గరికే వచ్చాం"

"మంచిపని చేశారు. మీవాడు హత్య చేసినందుకు పడే ఉరిశిక్ష తప్పించగలను. కాకపోతే చిన్న ట్రిక్ చేయాలి..." చెప్పి, సతీష్‌బాబు హత్య చేసిన వాడి చేతిలో ఇంకా అలానే వున్న కత్తిని తన హాండ్‌కర్ఛీఫ్‌తో అందుకొని, అతని వంటిపై నాలుగైదు చిన్న గాయాలు చేశాడు. అది చూస్తున్న క్లయింట్స్‌తోపాటు, మిత్రులిద్దరికీ మతిపోయినట్లయ్యింది. కత్తిని తిరిగి వారికే ఇచ్చేస్తూ-

"కంగారు పడకండి. హత్య ఇతను చేయలేదు. తనపై హతుడే హత్యా ప్రయత్నం చేయబోతే, ఆత్మ రక్షణ కోసం ప్రతిఘటించాడు. ఫలితంగా దురదృష్ట వశాత్తూ హతుడు చేతిలోని కత్తి అతనికే గుచ్చుకొని చనిపోయాడు, దట్సాల్" ట్రిక్ ఎలా వుందన్నట్టు అందరివైపూ చూసి చిద్విలాసంగా నవ్వాడు లాయర్.

ఆశ్చర్యం, ఆనందం ముప్పిరిగొనగా, "దీనికి సాక్ష్యం ఎలా తెస్తాం సార్?" అడిగారిద్దరు క్లయింట్స్ ఒక్కసారే.

"ఎక్కడ్నుంచో తేవడం ఎందుకు. ఇదుగో వీళ్ళిద్దరే సాక్ష్యమిస్తారు" అని."ఏరా! మీరు దీనికి సహకరించాలి. తగిన ఫీజు నేనిప్పిస్తానుగా" అన్నాడు మిత్రులిద్దరివంకా చూస్తూ లాయర్ సతీష్‌బాబు.

పాత స్నేహంవల్ల, మిత్రుడి వున్నతిని చుట్టం చూపుగా చూసిపోదామని వచ్చిన తమనే తన కేసు గెలవడం కోసం, అందుకు ప్రతిగా వచ్చే ధనరాశుల కోసం తెలివిగా సాక్ష్యానికి ఉపయోగిస్తున్న సతీష్‌బాబు అతి తెలివికి విస్తుపోయిన మిత్రులిద్దరూ నిశ్చేష్టు లయ్యారు- నల్లకోటు నాటకం ఎలా వుంటుందో ప్రత్యక్షంగా చూడ్డంతో.

— ఎన్.కె. నాగేశ్వరరావు


ఆంధ్రజ్యోతి
సచిత్ర వారపత్రిక

కాపీలు కొట్టే విద్యార్థులు, ఇన్విజిలేటర్లపై కత్తులు దూసి బెదిరించే స్టూడెంట్స్, బారులు, సినిమా హాల్స్, కాఫీ ఓటళ్ళలో తింటూ, తాగుతూ కాలక్షేపం చేసే యువతరానికి గుణపాఠం 'మా మంచి మేస్టారు'.

పర్యవేక్షకులు లేకుండా పరీక్షలు నడపడం సాధ్యమా? విద్యా ప్రమాణాలు పెరిగి, ఉత్తమ విద్యార్థులు తయారవాలంటే 'కొత్త' బాట కావాలి. ఆ కొత్త బాట వేసిన 'మా మంచి మేస్టారు' గురించి చదవండి! చదివి ఆలోచించండి!

పిల్లలు క్రమశిక్షణతో
నెల్ల శుభంబులను బొంది యొసగుదురనుచున్
దల్లియు దండ్రియునై వా
రెల్లర భావించి తీర్చి నెన్నికకెక్కన్ —
అరుగో ఆయనే 'మా మంచి మేస్టారు'

దేశాభివృద్ధికి కావలసింది ఉద్దండ పండితులు మాత్రమే కాదు కాదు కాదు - ఒళ్ళు దాచుకోకుండా నిజాయితీతో శ్రమించే చిత్తశుద్ధికల 'మా మంచి మేస్టర్లు' కావాలి.

డాక్టర్ కొత్త రవీంద్రబాబు సరికొత్త సీరియల్
వచ్చే వారం ప్రారంభం